పత్తికి ప్రాణం పోసిన వర్షం

తొలకరి వర్షాలతోనే పత్తి విత్తనాలు వేసిన రైతులు ఆ తర్వాత వర్షాలు కురవకపోవడంతో ఆందోళన చెందారు. కొన్ని చోట్ల రైతులు రెండో సారి విత్తనాలు వేశారు. కొన్ని మండలాల్లో అడపాదడపా పడిన వర్షాలు పంటలకు ఏమాత్రం సరిపోలేదు. అయితే గడిచిన రెండు రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు సరిపోవని ఇంకా కురవాలని రైతులు కోరుతున్నారు..


ఆసిఫాబాద్ మండలంలో సాగు చేస్తున్న పత్తి పంట

- రైతుల్లో చిగురించిన ఆశలు
- జిల్లాలో 3.5లక్షల ఎకరాల్లో పత్తి సాగు

ఆసిఫాబాద్, జూలై 10: ఎండలకు వాడిపోయి నేలవాలిన పత్తి మొక్కలకు జిల్లావ్యాప్తంగా మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రాణం పోసినట్లయింది. నేలవాలిన పత్తి మొక్కలు వర్షపు చినుకులకు నిగనిగ లాడుతున్నాయి. ఇంతకాలం వానల కోసం వేచిచూసిన రైతులు

● జిల్లాలో 4,60,196ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,60,196ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిలో పత్తి3.5 లక్షల ఎకరాలు, వరిపంట 59,212ఎకరాలు సాగవుతుందని అధికారులు అంచనాలు వేశారు. మొక్కజొన్న 742ఎకరాలు, జొన్న 680ఎకరాలు, పెసర 1700ఎకరాలు, మినుములు 163ఎకరాలు కంది 38,239 ఎకరాలు సాగవుతున్నట్లు అంచనాలు రూపొందించారు. అలాగే సోయాబీన్ 6089 ఎకరాలు, మిరప 3173ఎకరాలు, వేరుశనగ 178ఎకరాలు, అముదాలు 10 ఎకరాలు, నువ్వులు 10ఎకరాలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు.

సాగు చేసే సమయం దాటిపోతుందని వరుణుడిపై భారం వేసి జూన్ మొదటి వారంలోనే విత్తనాలను విత్తారు. విత్తనాలు విత్తిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీనికి తోడుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. విత్తిన విత్తనాలు మాడిపోవడంతో కొన్నిచోట్ల రైతులు రెండవ సారి పత్తివిత్తనాలను విత్తారు. అప్పుడప్పుడు వర్షాలు కురిసినా పంటలకు పెద్దగా లాభం జరగలేదు. దీంతో రైతన్నల్లో ఆందోళన నెలకొంది. వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు నిర్వహిం చారు. జిల్లా వ్యాప్తంగా మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట లకు ప్రాణం పోసినట్ల యింది. కురుస్తున్న వర్షాలతో రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

● జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా అన్నిమండలాల్లో గడిచిన మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు పంటల పాలిట వరంగా మారాయి. జూన్ 1నుంచి ఇప్పటివరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 283.4 మిల్లీమీటర్ల నమోదు కావాల్సి ఉండగా 312.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. మండలాల వారీగా పరిశీలిస్తే జైనూరు, సిర్పూర్- యు, లింగాపూర్, కెరమెరి, రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి, సిర్పూర్(టి), చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లో సాధారణ వర్షాపాతం కంటే అధిక వర్షపాతం నమోదు కాగా కాగజ్‌నగర్, తిర్యాణి, కౌటాల, పెంచికల్ పేట, దహెగాంలలో సాధారణ వర్షాపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయింది.

చాలా సంతోషంగా ఉంది..

- చిట్ల నారాయణ, రైతు, రహపల్లి



మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సంతోషంగా ఉంది. పంటలు పూర్తిగా ఎండిపోయేటట్లు అయ్యాయి. ఈ వర్షాలతో పంటలకు ఎంతో మేలు జరిగింది. పత్తి చేనులలో పత్తి మొక్కలు మొలకెత్తాయి. అయితే ఈ వర్షం సరిపోదు. ఇంకా వర్షం కురవాలి. ఇంకా వర్షాలు రాక పోతే సీజన్‌లో చాలా నష్టపోవాల్సి వస్తుంది.

పోడుభూములను స్వాధీనం చేసుకోవటం మానుకోవాలి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు


పోడు భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు

కాగజ్‌నగర్, జూలై 10: కాగజ్‌నగర్ మండలంలో కడంబా ప్రాంతంలోని పోడు భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకోవడం మానుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్‌పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. బుధవారం కడంబాలో పోడు భూములను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోడు రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా భూములను లాక్కుంటున్నారని తెలిపారు. ప్రభుత్వవిధానానికి అటవీశాఖఅధికారులు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా ఫారెస్టు అధికారులు వ్యవహరించటం సరికాదన్నారు. పోడు భూములను స్వాధీనం చేసుకునేది లేదని పేర్కొన్నప్పటికీ అటవీ అధికారులు పోడుభూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. గతంలో పోడుభూముల విషయంలో అప్పటి సీఎం కేసీఆర్ నిర్బంధకాండ చేశారని.. ప్రజావ్యతిరేకత వచ్చి చివరికి అధోగతి పట్టిందన్నారు. ఈ ప్రభుత్వానికి కూడా అదేగతి పడుతుందని అన్నారు. పోడుగోసను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. కార్యక్రమంలో రైతులు కోట భీమయ్య, సాంబయ్య, బూరం రాజు, దోతుల శ్రీనివాస్, జనార్దన్, గజ్జి ప్రసాద్,శేఖర్, కోటకోటేష్, మహేష్,ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కాగజ్‌నగర్ ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ నాయకుడు వల్లాల యాదగిరి మంగళవారం అకాలమరణం చెందగా, బుధవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, తదితరులున్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామానికి చెందిన పంకజ్ సర్కార్ కొన్ని రోజుల క్రితం ఇంటి పైనుంచిపడగా నడుము విరిగింది. దీంతో బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు బాధితుడిని పరామర్శించారు. ఆయన వెంటనాయకులు మల్లయ్య తదితరులున్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహూకరణ


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ దంపతులు

కాగజ్‌నగర్, జూలై 10: మండలకేంద్రంలోని బాలాజీనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.50వేల విలువగల వాటర్ ప్లాంట్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశుమందిరాలు క్రమశిక్షణకు నిలయంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం వాటర్‌ప్లాంట్‌ను డాక్టర్ శ్రీనివాస్, ఆయనసతీమణి అనితతో కలిసిప్రారంభించారు. కార్యక్రమంలో ఇందారి వెంకటేశం, వెంకటేశం, రాజన్న,గరుడాచలం,సిబ్బందిపాల్గొన్నారు

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్, జూలై 10: కాగజ్‌నగర్ ఎస్పీఎం క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని బుధవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సీనియర్ సభ్యులు ఎం సుభాష్, రెడ్డిగోపి మాట్లాడుతూ శరీరదారుఢ్యం కోసం తప్పకుండా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సభ్యులు పాపయ్య, తుమ్మరమేష్, ముంజం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, ఇన్నోవా ఢీ: ఇద్దరికి గాయాలు

వాంకిడి, జూలై 10: మండలంలోని గణేష్ ఎక్స్‌రోడ్డు సమీపంలో బుధవారం జాతీయ రహదారిపై లారీ, ఇన్నోవా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవా డ్రైవర్ తమిళనాడుకు చెందిన రాంకుమార్, అందులో ప్రయాణిస్తున్న మరోవ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. లారీ(ఎంహెచ్40 సీఎం9672) మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహారాష్ట్ర నుంచి వస్తున్న ఇన్నోవా వాహనం (యూపీ 76కె 2965) రాంగ్ రూట్‌లో అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఇన్నోవా డ్రైవర్, అతని పక్కన ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. ఈ విషయమై ఎస్సై సాగర్‌ను సంప్రదించగా రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఎస్పీకి సన్మానం


ఎస్పీని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆసిఫాబాద్, జూలై 10: ఆసిఫాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు శ్రీనివాస్,వెంకన్న, వెంకటేశ్వర్లు, సంతోష్, శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రమోద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘జీవో నం.317 రద్దు చేయాలి’

కెరమెరి, జూలై 10: ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన జీవోనెం.317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు బుధవారం మండలకేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీవోనెం. 317వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయ, ఉద్యోగులను సొంత జిల్లాలకు పంపిచడానికి ప్రభుత్వం దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా ఉపసంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆగస్టులోగా బదిలీలు పూర్తి చేసి ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతి, శివప్ర సాద్, సురేష్,నరేష్, వినీత్, శ్రీధర్, హరీష్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నుంచే పిల్లల చదువుకు పునాది

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే


అంగన్‌వాడీ టీచర్లకు ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 10: అంగన్‌వాడీ కేంద్రాల నుంచే పిల్లల చదువుకి పునాది పడుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలకేంద్రంలోని సఖికేంద్రంలో తిర్యాణి మండలంలోని రోజువారి అభివృద్ధి వివరాలను నమోదు చేసేందుకు 3,5జీ ట్యాబ్‌లను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిర్యాణి మండలం అస్పిరేషన్ బ్లాక్‌ప్రోగ్రాంలో వేగంగా అభి వృద్ధి పనులు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులకు అందించే ఆహారం, పిల్లల పూర్తి ప్రాథమికవిద్య, గృహసందర్శన, నెలవారి సేవల్లో భాగంగా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, టీకాలు, సామాజిక కార్యక్రమాలు తదితరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలన్నారు. పూర్వ ప్రాథమికవిద్య పాఠ్యప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జిల్లాస్త్రీశిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి భాస్కర్, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి సాదియా, తిర్యాణి బ్లాక్ సమన్వయకర్త మణివేలు, జిల్లా పోషణ్‌అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, సఖిసెంటర్ సమన్వయకర్త మమత, తిర్యాణి సూపర్‌వైజర్లు తిరుపతమ్మ, విజయ, యశోద, మాస్టర్ ట్రైనీలు కళావతి, సిందూర, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వనమహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలి

వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలను నెల చివరివరకు పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి మండల పరిషత్ అభివృద్ధిఅధికారులు, మండలపంచాయతీ అధికారులు, జాతీయ గ్రామీణాభివృద్ధి అధికారులు, అటవీ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జిల్లాగ్రామీణాభివృద్ధిశాఖకు 35.25 లక్షలు, అటవీశాఖకు 10.30లక్షలు మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. శాఖలవారీగా కావాల్సిన మొక్కల వివరాల నివేదికను అందించాలన్నారు. ఉపాధి హామి పథకంలో కూలీల సంఖ్య పెంచి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలన్నారు. ప్రతిఇంటికి మొక్కలు పంపిణీచేసి వాటిని సంరక్షించాలన్నారు. పల్లెప్రకృతివనాలు, బృహత్ పల్లె ప్రకృతివనాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ తది తరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖాధికారులు అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యాశాఖ అధీనంలో 426ప్రభుత్వ పాఠశాలలు, 17 కేజీబీవీలు, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని 282 పాఠశాలలో అమ్మఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యుదీకరణ, తాగునీరు, మూత్రశాల నిర్మాణం, అదనపు తరగతి గదుల పనులు, ఇతర మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలని తెలిపారు. 75 శాతం, 50 శాతం పనులు పూర్తయిన వాటికి ఎంబీ రికార్డులు పూర్తి చేసి సమర్పించాలన్నారు. వారం రోజుల్లో అన్ని పనులను పూర్తి చేయాలని, గ్రామ సమైక్యసంఘాల సహకారం తీసుకోవాలని తెలిపారు. నాణ్యతతో కూడిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం మండలాలవారీగా పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీఈవో రామకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు ఖాతాతో ప్రమాదబీమా

శ్రీరాంపూర్, జూలై 10: సింగరేణి కాంట్రాక్టు కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో జీరో అకౌంట్ తీసుకుంటే వివిధ రకాల ప్రయోజనాలున్నాయని సింగరేణికాలరీస్ కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీడబ్ల్యూ-ఐఎఫ్ టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. శ్రీరాంపూర్‌లోని సివిక్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో జీరో అకౌంట్ తీసుకున్న కార్మికుడు ప్రమాదంలో చనిపోతే అతని కుటుంబానికి 20లక్షల రూపాయలు బీమా పరిహారం ఇస్తారన్నారు. బ్యాంకు డెబిట్‌కార్డును ఆరునెలల్లో ఒకసారి వినియోగిస్తే మరో పదిలక్షల రూపాయలు అదనంగా ఇస్తారన్నారు. ఆ కుటుంబంలో 18 ఏళ్ల లోపు పిల్లలుంటే వారి చదువుకు 4లక్షల రూపాయలు ఇస్తారని తెలిపారు. సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు ఆధార్‌కార్డ్, పాన్‌కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజ్‌ఫొటోతో బ్యాంకును సంప్రదించి జీరోఅకౌంట్ ఖాతా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బి అప్పారావు, జి శంకర్, వెంకన్న, శ్రీను, రాజేశ్, సురేష్ పాల్గొన్నారు.

‘గనిలో రక్షణతో పనిచేయాలి’

శ్రీరాంపూర్, జూలై 10: ఉద్యోగులుగనిలో రక్షణతో పనిచేయాలని జీఎం (రక్షణ-కార్పొరేట్) గురువయ్య అన్నారు. ఆర్కే6గనిపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల భద్రత ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. రక్షణతోకూడిన ఉత్పత్తిని సాధించి, సింగరేణి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ నెల చివరలో రిటైర్ కాబోతున్న ఆయనను ఉద్యోగలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం ఎం శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: జీఎం

మందమర్రి టౌన్, జూలై 10: ఆరోగ్యమే మహాభాగ్యమని జీఎం మనోహర్ తెలిపారు. బుధవారం ఏరియాలోని కేకే ఓసీ వద్ద రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ స్క్రీనింగ్ క్యాంపునకు ఆయన హాజరై మాట్లాడారు. సంస్థలో పనిచేసే ఒప్పంద కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు యాజమాన్యం ఈనిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆరోగ్యానికి సంబంధించి కార్మికుల్లో అవగాహన కల్పించే దిశగా ఈ క్యాంపు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్‌శ్యాంసుందర్, ప్రాజెక్టు ఇంజనీర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికి కేటాయించేవరకు ఉద్యమం


మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట దీక్షపరులకు కండువాలు వేస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, జూలై 10: సింగరేణికి చెందిన బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించేవరకు ఉద్యమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్, మందమర్రి జీఎం కార్యాలయాల ఎదుట చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి 3వరోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ, బొగ్గుబ్లాకులకువేలం నిర్వహించడాన్ని గుర్తింపు సంఘంగా తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సంస్థకు నాలుగు బొగ్గుబ్లాకులను కేటాయించే వరకు ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలోయూనియన్ ఉపప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టెకిషన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నిర్వట్లమల్లేష్, కార్యదర్శి మారేపల్లి సారయ్య, బద్రి బుచ్చయ్య, కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు, మందమర్రిలో మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచికార్యదర్శులు, ఏరియా నాయకులు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్‌అలీ, దాగంమల్లేష్, ఇప్పకాయల లింగయ్య, సుదర్శన్, హరిరామ కృష్ణ,రామకృష్ణ, రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, నరేంద్ర, బాల్‌రెడ్డి, సిరాజ్, గోవర్దన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనక్ ప్రసాద్‌కు ఘన సన్మానం


జనక్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్/మందమర్రి టౌన్,, జూలై 10: రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైరన్‌గా నియమితులైన ఐఎన్‌టీయూసీ సెక్రెటరీజనరల్ బిజనక్‌ప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్ (కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం)లో బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కార్మికశాఖ కమిషనర్ ఆదిత్య, తదితరులు హాజరయ్యారు. బాధ్యతలు చేపట్టిన జనక్‌ప్రసాద్‌ను ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్రకమిటీ నాయకులు కలవేన శ్యామ్, భీంరావు, గరిగె స్వామి, ల్యాగల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, చిన్నయ్య, మల్లారెడ్డి, భీం రవి, వెంగళకుమార్, నర్సింగ్, అశోక్, తదితరులు భారీ పూలమాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. సన్మానించి వారిలో మందమర్రి నుంచి కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, నాయకులు మిట్ట సూర్యనారాయణ, పుల్లూరి లక్ష్మణ్‌తో పాటు అన్నిగనుల పిట్ కార్యదర్శులు, ముఖ్యనాయకులు ఉన్నారు.

‘కొత్త గనులు కేటాయించకుంటే సమ్మె తప్పదు’

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, జూలై 10: కొత్తగనులు కేటాయించకుంటే సమ్మె తప్పదని సింగరేణికాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, మందమర్రిలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నాగరాజు గోపాల్, బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్, మందమర్రి జీఎం కార్యాలయాల ఎదుట బుధవారం వారు ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని, మందమర్రిలోని కేకే6, శ్రావణపల్లి బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల18న సింగరేణి భవన్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. అనంతరం డీజీఎం(పర్సనల్) పి అరవిందరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి దుంపల రంజిత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, మందమర్రిలో రాజేందర్, రామస్వామి, ఐలయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, వెంకటేష్, అరీఫ్, భరత్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

‘కార్మికులను ఒత్తిడిచేసే విధానాన్ని రద్దు చేయాలి’

రెబ్బెన, జూలై 10: ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో కార్మికులపై ఒత్తిడిచేసే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని బుధవారం ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో గని మేనేజర్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లో, రెడ్‌కార్డు సిస్టం అంటూ సూపర్‌వైజర్లపై, కార్మికులపై ఒత్తిడిచేసే విధానానికి వెంటనే స్వస్తి పలకాలని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గోలేటిబ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓదెలు, మైన్స్, సేఫ్టీ కమిటీ మెంబర్స్ అల్లాడి కోటి, అన్నం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కాసిపేట, జూలై 10: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యాశాఖ రాష్ట్రపరిశీలకులు శ్రీనివాసులు అన్నారు. సోమగూడెం లంబాడితండా (ఎస్) జిల్లాపరిషత్ పాఠశాల, ఎంపీపీఎస్‌పాఠశాలను బుధవారంఆయన సందర్శించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలల్లో స్కావెంజర్ లేరని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా గ్రామపం ాయతీ పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నెన్నెలలచ్చయ్య, ప్రధానోపాధ్యాయురాలు వాణికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

లక్షెట్టిపేటరూరల్, జూలై 10: మండలంలోని గుళ్లకోటగ్రామంలో బుధవారం విద్యాదా ఘాతంతో మహిళ మృతిచెందింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం పనాస లక్ష్మీ(52)తన ఇంటిసమీపంలో ఉన్న భూమిలో కూరగాయాలు సాగు చేస్తుంది. ఆస్థలంలో పనిచేయడానికి వెళ్లి పక్క పొలంకు ఉన్న ఫెన్సింగ్‌కు కరెంటు వైరు ఉండడంతో దానికితగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. కాగా కొంతకాలంగా స్థలం విషయంలో గొడవ జరుగుతుందని, రెండుసంవత్సరాలక్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ కూడా జరిగిందన్నారు. అప్పటి నుంచి పక్క పొలానికి చెందిన యాజమానులు ఇరుకుల సత్యనారాయణ, రావుల అంజన్న, ఆస్థలంలో నర్సరీ నడుపుతున్న తిప్పని చిలుకయ్యలు లక్ష్మీని చంపుతామని బెదిరించినట్లు కుటుంబీకులు తెలిపారని ఎస్ఐతెలిపారు. మృతురాలు కూతురు సౌందర్య ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సంఘటన స్థలాతన్ని సీఐ నరేందర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు ఇది హత్యనా లేక అనుకోకుండా జరిగిందా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

నెన్నెల, జూలై 10: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని నేతకాని(మహర్) సంఘం రాష్ట్రఅధ్యక్షుడు జాడి నర్సయ్య డిమాండ్ చేశారు. మన్నె గూడంలో ఆయన బుధవారం నేతకాని కుల ఆత్మగౌరవ జెండా ఆవిష్కరిం చారు. అనంత రం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతమైన ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఆదివాసీ, ఎస్సీ, బీసీ రైతులు పోడుసాగుచేసుకొని జీవనం సాగిస్తు న్నారని అన్నారు. పట్టాలు లేక వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పహనీలు రాక రైతులు ఇక్కట్ల పాలవుతున్నారని అన్నారు. నేతకాని కులస్తుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గట్టు బానేష్, గ్రామఅధ్యక్షుడు పెరుగు తిరుపతి, నాయకులు గట్టు రాజయ్య, శివలింగయ్య, జోలె సురేష్, లింగయ్య, పోసక్క గంగయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

దండేపల్లి,జూలై 10: జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల శంకరయ్య(74) అనే వృద్ధుడు మండలంలోని తాళ్ళపేట గ్రామశివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికిచెందిన గోలాడి రాకేష్, ఎడ్లశంకరయ్య పనుల నిమిత్తంబైక్‌పై మంగళవారం లక్షెట్టిపేట వెళ్లారు. ఇంటికి వస్తుండగా దండేపల్లి మండలం తాళ్ళపేట ప్రభుత్వఆసుపత్రి వద్దకు రాగానే రాత్రి సమయంలో అడవిపంది బైక్‌కు అడ్డువచ్చింది. అకస్మాత్తుగా బైక్‌ను ఆపడంతో అదుపుతప్పి పడిపోయారు. శంకరయ్య తల,చేతులు, కాళ్లకుతీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

జైనూర్, జూలై 10: మండల కేంద్రంలో బుధవారం గ్రామీణ పేదలసంఘం ఆధ్వర్యంలో దేవులపల్లి వెంకటేశ్వర్‌రావ్, తరిమెల నాగిరెడ్డి సంస్మరణసభ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈనెల 26న ఉట్నూరులో తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు.ప్రజలుఅధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కుటికెల ఆశన్న కోరారు. కార్యక్రమంలో సెడాం ధర్ము, సిడాం రాజు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు రైతు భరోసా మంజూరు చేయాలి

జైనూర్, జూలై 10: ఏజెన్సీలోనివసిస్తున్న ఎస్సీ,బీసీ రైతులకు రైతు భరోసా మంజూరు చేయాలని పూలె మహాజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ కోరారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతు గిరిజనప్రాంతంలో ఎలాంటి ఆధారంలేని ఎస్సీ, బీసీలను ఆదుకోవాలని పేర్కొన్నారు. సమావేంలో ఆ సంఘం జిల్లాఅధ్యక్షుడు దండుగుల మహేష్, మవాలె దత్త, దడెకర్ శివానంద్, సుద్దాల ఆనంద్ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఎడ్ల జతలు పంపిణీ

సిర్పూర్(యు), జూలై 10: మండలంలోని బాబ్జిపేట్ గిరిజన రైతులకు బుధవారం ఏకలవ్యఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎడ్లజతలు పంపిణీచేశారు. బాబ్జిపేట్‌లో అమలవుతున్న సుస్థిర జీవనోపాధి పథకంలో ఎడ్లులేని నిరుపేదగిరిజన రైతులకు ఎడ్లజతలు పంపిణీ చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోగల శ్రీచక్రేశ్వర గోశాల సహకారంతో 20మంది రైతులకు ఎడ్ల జతలు అందించారు.

ఫర్టిలైజర్ దుకాణం యజమానిపై రైతు ఫిర్యాదు

దహెగాం(పెంచికలపేట), జూలై 10: పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామానికి చెందిన పర్టిలైజర్ దుకాణం యజమాని దాడికి పాల్పడినట్లు రైతు పొట్టి మహేష్ బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 6న ఫర్టిలైజర్ దుకాణం యజమాని పిలిపించి పాతబకాయిడబ్బుల విషయంలో అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

చెట్లతోనే మానవాళికి మనుగడ

చింతలమానేపల్లి, జూలై 10: చెట్లేమానవాళికి మనుగడని ఎంపీడీవో ప్రసాద్‌అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో వనమహోత్సవంలోభాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి మొక్కలునాటారు.

చోరీ కేసులో ఏడాది జైలు శిక్ష

నెన్నెల, జూలై 10: మైలారం గ్రామానికిచెందిన కాపెల్లి శ్రీనివాస్‌కు చోరీ కేసులో ఏడాది జైలుశిక్ష,రూ.2వందల జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జూనియర్‌సివిల్‌జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముకేష్ బుధవారం తీర్పు చెప్పారని నెన్నెల ఎస్సైప్రసాద్ తెలిపారు. మైలారంలోని సాయిబాబా మందిరంలోని హుండీ2022జూలై7న ఎత్తుకెల్లి నగదుదోచుకున్నాడని చెప్పారు. గుడి పూజారి ఫిర్యాదు మేరకు అప్పటిఎస్సై కేసునమోదుచేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారని వివరించారు. పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా.. అదనపు పీపీ అజయ్ కుమార్ వాదించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారని ఎస్సై తెలిపారు.

హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని

- నస్పూర్ కేజీబీవీలో ఘటన


గాయపడిన అక్షర

నస్పూర్, జూలై 10: హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక తప్పించుకుని ఇంటికి వెళ్లాలని ఓ ఆరవ తరగతి విద్యార్థిని బుధవారం పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి దూకిన ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల పట్టణం కాలేజ్ రోడ్‌కు చెందిన అలవాల లక్ష్మణ్-అమూల్య దంపతులు కూలీ పనులు చేసుకుని జీవిస్తారు. తమ కూతురు అక్షరను బాగా చదువుకోవాలని 15 రోజుల కిందట నస్పూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతిలో చేర్పించారు. అప్పటి నుంచి తల్లిదండ్రులు వచ్చినప్పుడు తాను ఇక్కడ ఉండనని మారాం చేసేది. తల్లిదండ్రులు మంచిగా చదువుకోవాలని నచ్చజెప్పేవారు. మంగళవారం తండ్రి లక్ష్మణ్ పాఠశాలకు వచ్చి అక్షరను కలిసి మాట్లాడాడు. తండ్రితో తాను ఇక్కడ ఉండనని ఇంటికి తీసుకెళ్లాలని కోరింది. తండ్రి నచ్చజెప్పి వెళ్లిపోయాడు. ఎలాగైనా ఇంటికి వెళ్లాలని అక్షర బుధవారం ఉదయం 5.45 సమయంలో భవనం రెండో అంతస్తు పైనుంచి దూకింది. పెద్దగా చప్పుడు రావడంతో గమనించిన పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక, నైట్ వాచ్‌ఉమన్ అనూష సంఘటన స్థలానికి వచ్చి తీవ్రంగా గాయపడిన అక్షరను మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అక్షరకు చికిత్స అందించిన వైద్యులు వెన్నెముకకు బలమైన గాయమైందని గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

కేజీబీవీ హాస్టల్ నుంచి పారిపోయిన ఇద్దరు విద్యార్థినులు

- సికింద్రాబాద్‌లో గుర్తించిన పోలీసులు

భీమారం, జూలై 10: మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థినులు చదువుపై ఇష్టం లేక బుధవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో హాస్టల్ గోడను దూకి పారిపోయారు. సీసీ పుటేజీ ద్వారా వారు వెళ్లిన మార్గాన్ని గుర్తించి 24 గంటలలోపే పోలీసులు వారి ఆచూకీ కనుగొన్నారు. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నెన్నెల మండలానికి చెందిన బాలిక, శ్రీరాంపూర్‌కు చెందిన బాలిక తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వారికి చదువుపై ఇష్టం లేక పోవడంతో హాస్టల్ నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. కాలినడకన రెండున్నర కిలోమీటర్లు నడిచి మండల కేంద్రంలోని ఆవడం క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న హోటల్ నడిపే వ్యక్తితో తమ బంధువులు ఆసుపత్రిలో ఉన్నారని సీసీసీ శ్రీరాంపూర్ వరకు పంపించాలని కోరారు. తన హోటల్‌కు పాలుతీసుకొచ్చే ఆటోలో పంపించాడు. సీసీసీ శ్రీరాంపూర్ నుంచి ఆ బాలికలు మంచిర్యాల రైల్వేస్టేషన్‌ను చేరుకున్నారు. విద్యార్థినులు కనబడక పోవడంతో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. పరిసరాల్లోని సీసీ పుటేజీలు పరిశీలించి మంచిర్యాలలో రైలు ఎక్కినట్లు గుర్తించారు. బాలికల బంధువులను విచారించారు. అందులో ఒక బాలిక తల్లి హైదరాబాద్‌లో ఉంటుందని తెలిపారు. దీంతో విద్యార్థిని తల్లికి ఫోన్ చేయగా మధ్యాహ్నం 3 గంటల వరకు తన దగ్గరకు వచ్చారని చెప్పింది. రైలులో ఉన్న సమయంలో అక్కడ ఉన్న వ్యక్తుల ఫోన్ నుంచి తనకు తెలియజేయడంతో తాను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తీసుకెళ్లానని చెప్పింది. దీంతో భీమారం ఎస్సై పోలీసులతో కలిసి వాహనంలో సికింద్రాబాద్‌కు వెళ్లారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


శరత్‌కుమార్(ఫైల్)

హాజీపూర్, జూలై 10: మండలంలోని ముల్కల్ల గ్రామానికి చెందిన కోల శరత్‌కుమార్ (33) అనే యువకుడు మనస్తాపంతో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శరత్‌కుమార్‌కు పది నెలల క్రిత వివాహం జరిగింది. భార్య భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఇద్దరు విడాకులు తీసుకోవడానికి పెద్ద మనుషుల సమక్షం లో ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో తరుచూ పంచాయతీలు జరుగుతుండడంతో తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టడం ఇష్టం లేక మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. శరత్‌కుమార్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన పనులకు ఆమోదం

- తగ్గనున్న దూరం - శివ్వారం-మంథని పరిధిలో గోదావరిపై నిర్మాణానికి ఉత్తర్వులు

జైపూర్, జూలై 10: మంచిర్యాల జిల్లా శివ్వారం, పెద్దపల్లి జిల్లా మంథనిని కలుపుతూ గోదావరి నదిపై మరో హైలెవెల్ వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో చెన్నూరు నుంచి మంథనికి వెళ్లడానికి దూరభారం తగ్గనుంది. నూతనంగా ఏర్పాటు చేయనున్న మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి మండలంలోని నర్వ నుంచి గోపాల్‌పూర్ మీదుగా పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని విలోచవరంలో కలుస్తుండగా ఇక్కడ కూడా గోదావరిపై వంతెన నిర్మాణానికి టెండర్లు సైతం ఖరారయ్యాయి. మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ప్రభుత్వం మరో వంతెన కోసం రూ. 125 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది.

- 70కిలోమీటర్లకు పైగా..

గతంలో చెన్నూరు నుంచి మంథనికి రావాలంటే గోదావరిఖని మీదుగా 70 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాలి. అయితే గోదావరి మీద సుందిళ్ల బ్యారేజీ నిర్మించడంతో ఈ దూరం కాస్త తగ్గింది. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న శివ్వారం-మంథని హైలెవెల్ వంతెన అందుబాటులోకి వస్తే చెన్నూరు-శివ్వారం 27 కిలోమీటర్లు, శివ్వారం-మంథని 6 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ ప్రాంతంలో పర్యాటకంగా శివ్వారంలోని మొసళ్ల అభయారణ్యం, ఆధ్యాత్మికంగా వేలాలలోని మల్లికార్జునస్వామి ఆలయానికి రాకపోకలు సాగించడానికి సులభం అవుతుంది. ఈ ప్రాంతం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.

- త్వరలో శంకుస్థాపన..

రూ. 125 కోట్లతో నిర్మించనున్న ఈ వంతెనకు 15 రోజుల్లో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ విషయాన్ని ఇటీవల మంథనిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా వెల్లడించారు.


శివ్వారం గ్రామ శివారులో గోదావరి నదిపై వంతెన నిర్మించే ప్రదేశం

దీంతో పాటు మంచిర్యాల-అంతర్గాం వంతెనకు కూడా శంకుస్థాపన చేస్తారని సమాచారం. కాగా శివ్వారం-మంథని గోదావరి నది మీద వంతెన ఏర్పాటు కానుండడంతో ప్రజలు సంతోషిస్తున్నప్పటికీ సాంకేతికపరంగా చూస్తే కొన్ని ఇబ్బందులు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే శివ్వారం మొసళ్ల అభయారణ్యం రక్షిత ప్రాంతం పరిధిలోనే నూతన వంతెన ఏర్పాటు చేయనున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వ చట్టాలు అడ్డువచ్చే అవకాశం కూడా ఉందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంచిర్యాల అర్బన్, జూలై 10: పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ రెస్టారెంట్‌లో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెస్టారెంట్‌లో కొంతమంది డబ్బులను పందెం కాసి పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ రెస్టారెంట్‌పై దాడి చేసి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.1,78,030 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పేకాట సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ

జైపూర్, జూలై 10: సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించవచ్చని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. రసూల్‌పల్లిలో దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న ఐదు సీసీ కెమె రాలను బుధవారం ఏసీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జైపూర్, జూలై 10: ఇందారంలోని ఖాసింపల్లి ఫ్లైఓవర్ వద్ద బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదాంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఐకే1ఏ గనిలో పనిచేసే సింగరేణి కార్మికుడు మీనుగు శ్రీను, మండలంలోని మద్దులపల్లికి చెందిన తాపీమేస్త్రీ పనిచేసే గాజుల కనకయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని బ్లూకోల్ట్స్ పోలీసులు సత్యనారాయణ , మనోహర్‌లు 108లో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

కన్నెపల్లి, జూలై 10: వీవోఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కన్నెపల్లి మండల తెలంగాణ తల్లి మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యకు బుధవారం వీవోఏలు వినతి పత్రం అందించారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీసీలుగా ప్రమోషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వేతనం నేరుగా ఖాతాల్లో జమ చేయాలని, ఆన్‌లైన్‌పనులను రద్దు చేయాలని, శ్రీనిధి ఇన్సెంటివ్ వీవోఏల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు జుమ్మిడి లక్ష్మణ్, కార్యదర్శి గంధం దాసు, ఎల్లయ్య, శంకరయ్య, ధర్మయ్య, ప్రమీల, వసంత పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

బెల్లంపల్లి, జూలై 10: విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుం దని నాయకులు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బుధవారం జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలను, ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమం లో నాయకులు దీపక్‌కుమార్, సూర్య, కార్తికేయ, సంజీవ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

జన్నారం, జూలై 10: మండలంలోని మొర్రిగూడ గ్రామంలోని రాఘవేంద్ర రైసుమిల్లులో బుధవారం విజిలెన్స్ , సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. బియ్యం, ధాన్యాం బస్తాలను పరిశీలించారు. స్టాకు రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. అక్రమ నిల్వలు ఉంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా సివిల్ సప్లయి అధికారి శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

జైపూర్, జూలై 10: చదువుతోనే సమాజంలో మంచి గౌరవం లభిస్తుందని ఎస్సై శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు షీటీం, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థు లు సెల్‌ఫోన్ మోజులో పడి చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో ఫణిబాల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మందమర్రిటౌన్, జూలై 10: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి అందుగులపేట సమీపంలో బుధవారం సాయంత్రం బొలేరో వాహనం ఢీకొని అందుగులపేటకు చెందిన సంద్ర ధర్మయ్య (42) అక్కడి కక్కడే మృతిచెందాడు. సాయంత్రం ధర్మయ్య వాకింగ్ చేసి ఇంటికి తిరిగి వెళ్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ధర్మయ్య మృతదేహం రోడ్డుపై పడి ఉండగా బెల్లంపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు గమనించకుండా ఢీకొట్టడంతో కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమ నించి మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వాహనదారుడు శ్రీరాంపూర్‌లోని సీసీకి చెందిన వాడని తెలిసింది.

- బావిలో దూకి యువకుడు..

పట్టణంలోని మారుతినగర్‌కుచెందిన దుర్గం శ్రీకాంత్ (28) అనే యువకుడు మద్యం మత్తులో ఇంట్లో బావిలో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి బావిలోనుంచి తీసేలోపు అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటిని విడుదల చేయాలని రైతుల వినతి

భీమారం, జూలై 10: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టు నీటిని కాలువల ద్వారా తమపంట పొలాలకు విడుదల చేయాలని కోరుతూ ప్రాజెక్టు డీఈ ప్రవీణ్‌కుమార్‌కు కాంగ్రెస్ జిల్లా నాయకుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే 20 రోజులు అవుతుందని నీటిని విడుదల చేస్తే నారుమడులు వేసుకుంటామని తెలిపారు. ఆలస్యంగా విడుదల చేస్తే పంటలు నష్టపోతున్నామని ఈ సారైనా సమయానికి నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన డీఈ వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి విడుదల చేసే నీటి మట్టం రాలేదని, నీటి మట్టం రాగానే విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు మల్లయ్య, తౌర్యనాయక్, జైదల రాజన్న, బోగె మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

కాసిపేట, జూలై 10: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని మంచి ర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. బుధవారం కాసిపేట, దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల తో మర్యాదగా మాట్లాడి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొనసాగించాలన్నారు. నేరాల నియంత్ర ణకు పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మంద మర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.


దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న డీసీపీ భాస్కర్

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నాయకుల ధర్నా

ఆసిఫాబాద్, జూలై 10: ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూనాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని మిరమించుకోవాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీకాంత్, రాజయ్య, సమ్మయ్య, వనిత, ధనలక్ష్మి, సరోజ, లలిత, అరుణ, భారతి,ఇందు, కవిత తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట..

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లాకార్యదర్శి ముంజం శ్రీని వాస్ మాట్లాడుతూ సమస్యలను పరి ష్కరించాలని కొన్ని సంవత్సరాలుగా అంగన్‌వాడీలు పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నా రు. పెండింగ్‌లో ఉన్న జీవోలను వెంటనే అమలుపర్చాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రఘునాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సీఐటీయూ అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

తిర్యాణి/కెరమెరి/దహెగాం/ సిర్పూర్(టి)/ పెంచికలపేట/ చింతలమానేపల్లి/బెజ్జూరు: గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనకార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని బుధవారం మండల కేంద్రాల్లో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాల యాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. తిర్యాణిలో జరిగిన కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు శంకర్,మారుతి, అంగన్‌వాడీలు పార్వతి, సుజాత, ఆశావర్కర్లు భద్రుబాయి, భీంబాయి, మధ్యాహ్న భోజన కార్మికులు చంద్రకళ, ఊర్మిళ, కెరమెరిలో అంగన్‌వాడీలు సావిత్రి, అనసూయ, కవిత, గుణసుందరి, పద్మ, రాధ, అయ్యూబాయి, దహెగాంలో కార్మికులువజ్రమ్మ,జయప్రద, మమత, పద్మ, మహేశ్వరి, శోభ,అరుణ్‌గౌడ్, శంకర్, మారుతి, బెజ్జూరులో అంగన్‌వాడీలుస్వప్న, తిరుపతమ్మ, దుర్గ, పార్వతి, సిర్పూర్(టి), పెంచికలపేట, చింతల మానేపల్లి మండలాల్లో ఆయాశాఖల కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, జూలై 10: ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరవిచారణ మరింత సమర్థవంతంగా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో నాన్‌గ్రేవ్ కేసులు, గ్రేవ్‌కేసుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలగురించి అధికారులకు వివరించారు. రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘావ్యవస్థను పటిష్టపర్చాలని అన్నారు. దొంగతనాల నివారణకు ప్రతిసర్కిల్ పరిధిలో ఒకస్పెషల్ టీంను నియమించాలన్నారు. డ్రంకన్‌డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. పొంగుతున్న బ్రిడ్జిలు, చెరువుల దగ్గర బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గుట్కా, అక్రమ ఇసుక రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ బియ్యంపై నిఘాఉంచి దాడులు నిర్వహిచాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ సదయ్య, కరుణాకర్, డీసీఆర్బీ, ఎస్బీ, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్సై, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు: కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 10: జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, జిల్లావ్యవసాయాధికారి శ్రీనివాసరావుతో కలిసి వ్యవసాయాధికారులతో ఎరువుల నిలువ, సుబాబుల్, ఇంక్యులిప్టస్ మొక్కల పెంపకం ద్వారా అధికలాభాల సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో ఎరువులు, పిచికారి, మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగ్రో డీసీఎంఎస్, ప్యాక్స్ ద్వారా రైతులు ఎరువులు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ నిర్వహించాలన్నారు. తనిఖీ సమయంలో రిజి స్టర్ల నమోదు, నిలువ, గోదాంలో ఉండే నిలువ ఒకేలా ఉండాలన్నారు. రైతులకు విక్రయించిన ఎరువులవివరాలు, ఎరువుల నిలువలు ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. వర్షాకాంలో పంటలకు సరిపడ ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలని, వరి నాట్లు వేసే సమయంలో ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ భూమిలో ఖాళీస్థలాల్లో, చేల గట్లపై సుబాబుల్, ఇంక్యు లిప్టస్ మొక్కలు నాటడం ద్వారా పొందే లాభాలపై రైతులకు అవగా హన కల్పించాలని అన్నారు. ఔత్సాహిక రైతులను ప్రోత్సహించాలని, అధిక ఆదాయం పొందే విధంగా కృషిమిత్ర, డ్రోన్‌మిత్రల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్, పట్టాదారులు, మరణించిన వారి వివరాలను సేకరించి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, అదనపు గ్రామీణాభివృద్ధ అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సబ్‌స్టేషన్ పూర్తయితే లోవోల్టేజీ సమస్య పరిష్కారం

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కౌటాల, జూలై 10: కౌటాల మండలంలో నిర్మిస్తున్న 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తయితే నియోజకవర్గంలో చాలావరకు లోవోల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం విద్యుత్ శాఖాధికారులతో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను దసరాలోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, రాజేందర్‌గౌడ్, మోతీరాం, తిరుపతి, సుశీల్‌మండల్, మురళీ, సుధా కర్, రమేష్, రావు, మిథున్ కవిరాజ్, గణేష్ రష్తన్, ప్రకాష్, బద్రేశ్వర్, శంకర్, రామయ్య, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

పాము కాటుతో వృద్ధురాలి మృతి

రెబ్బెన, జూలై 10: వంండలకేంద్రానికి చెందిన ఇప్ప ఎల్లక్క (70) బుధ వారం పాము కాటుతో మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ఆవరణలో వంట చేస్తుండగా పాత్రల పక్కనున్న పాము ఎల్లక్కను కాటువేసింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందినట్టు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.


ఇప్ప ఎల్లక్క(ఫైల్)

అద్దె గదులకు బహిరంగ వేలం

కాగజ్‌నగర్ టౌన్, జూలై 10: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా మార్కెట్‌లో నూతన వాణిజ్య గదులను అద్దె ప్రాతిపాదికన 5సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వ హించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11నుంచి 24న సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తుతోపాటు రూ. 25,000 మున్సిపల్ కార్యాలయంలో నగదు లేదా డీడీ రూపంలో అందజేయాలన్నారు. ఈనెల 25న ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఇందిరా మార్కెట్‌లోని చికెన్ సెంటర్స్ వెనుకగల(6)గదుల్లో ఒక్కోగదికి రూ. 3,33,288, మటన్‌షాపుల వెనుక ఉన్న (5)రూముల్లో ఒక్కోదానికి రూ.3,85,288 గుడ్‌విల్ కింద జమ చేయాలన్నారు. వేలంపాటలో గది దక్కిన తర్వాత ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తం నాన్ రిఫండబుల్‌గా ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల రిజర్వేషన్ ప్రకారం రూము నెంబర్ 1, 2లు ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తామన్నారు. కావున సంబంధిత కేటగిరీ వారే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సకాలంలో రాని డీడీలు స్వీకరించబడవన్నారు. వేలం పాటలకు డిపాజిట్ చెల్లించి, ఒక్కరూ మాత్రమే వేలంలో పాల్గొనాల న్నారు. వేలంలో గదులు దక్కించుకున్న వ్యక్తి 15 రోజుల్లోగా గుడ్‌విల్ మొత్తం చెల్లించి అగ్రిమెంటు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ అంజయ్య తెలిపారు.

నాటుసారా స్వాధీనం

దహెగాం(పెంచికలపేట), జూలై 10: పెంచికలపేట మండలం ధరోగపల్లి గ్రామంలో బుధవారం నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీన పర్చుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. అదేవిధంగా ఇద్దరు పాత నిందితులు అజ్మీర రమేష్, జెట్టిబాపును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం


కానిస్టేబుల్ స్రవంతిని సన్మానిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

ఆసిఫాబాద్, జూలై 10: తమిళనాడులో గతనెల 15నుంచి 20 వరకు జరిగిన ఆల్‌ఇండియా పోలీసుస్పెషల్ షూటింగ్ కాంపిటేషన్- 2024లో పారామిలిటరీ ఫోర్స్‌తో జరిగిన గ్లాక్‌పిస్టల్ షూటింగ్ ఈవెంట్‌లో జిల్లాలోని కౌటాల పోలీసు స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ బి స్రవంతి తెలంగాణ పోలీసు తరఫున ఏడో ర్యాంకు సాధించింది. అదేవిధంగా పదవతెలంగాణ స్టేట్‌షూటింగ్ కాంపి టీషన్‌లో 25మీటర్ల ఫైర్ ఆర్మ్ స్పోర్ట్స్ పిస్టల్ షూటింగ్ ఈవెంట్‌లో 300కు స్కోరుకు గాను 276సాధించి సిల్వర్ మెడల్ గెలుపొందింది. 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 400 మార్కులకు గాను 365 మార్కులు సాధించి రజత పథకం సాధించడంపై ఎస్పీ డీవీ శ్రీని వాసరావు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. స్రవంతికి సహక రించిన డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్ పాషా, ఎస్సై మధుకర్, ఆర్ఐ పెద్దయ్యను ఎస్పీ అభినందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఓపెన్‌కాస్టు భూనిర్వాసితులు

రెబ్బెన, జూలై 10: కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని గోలేటి సింగరేణి ఓపెన్ కాస్టు నిర్వాసితులు బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్, లీగల్‌సెల్ జిల్లా నాయకులు జుమ్మడి రాజేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో గోలేటి ఓపెన్‌కాస్టు పరిధిలోని సోనాపూర్, గోలేటి, అబ్బాపూర్‌లో ఇళ్లు, భూములు కోల్పోతున్న ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగము, ఎకరానికి రూ.20 లక్షల డబ్బులివ్వాలని కోరారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు, తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమస్యలను వివరిస్తున్న భూ నిర్వాసితులు



ప్రమోషన్లు ఇవ్వడం హర్షణీయం

చెన్నూరు, జూలై 10: ప్రభుత్వం బాషా పండితులకు ప్రమోషన్‌లు ఇస్తూ బదిలీ చేయడం హర్షణీయమని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణచారి అన్నారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి, కొమ్మెర, ఆస్నాద, నాగాపూర్, సుద్దాల, దుగ్నేపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను బుధవారం సందర్శించారు. చాలా రోజులకు ప్రమోషన్ లభించిందని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సునీల్‌కుమార్, మహిపాల్, శ్రీనివాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

- మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాల అర్బన్, జూలై 10: భూ కబ్జాలకు పాల్పడినా, భూమి సంబంధిత గొడవల్లో పాల్గొన్నా, అమాయకులను మోసం చేసినా సంబంధిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుం టామని మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్ అన్నారు. పట్టణంలోని టూటౌన్ ప్రాంతంలో గల గాంధీనగర్‌లో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమా నాస్పద వ్యక్తులెవరైనా ఆ ప్రాంతంలో నివాసమంటున్నారా అనే కోణంలో ఆరా తీస్తూ ప్రతీ ఒక్కరి గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో ఏసీపీ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశామని చెప్పారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి తెలియజేయడంతో పాటు వాటి వాడకంతో కల్గే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, నిబంధలను అతిక్రమించే వారిపై తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్సైలు కె.మహేందర్, ప్రశాంత్, సనత్‌కుమార్, ఏఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

ఏసీసీ, జూలై 10: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కార్మెల్ కాన్వెంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటడంతో బుధవారం పలువురు అభినందించారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో పి సిద్ధార్థ మొదటి స్థానంలో నిలువగా 600 మీటర్ల పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో సృష్టియోగ్యత 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీకేతన్ 300 మీటర్ల పందెంలో తృతీయ స్థానంలో నిలిచాడు. బ్రాడ్‌జంప్ పోటీలో ఎండీ సాహిర్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ రిన్సీ, సిస్టర్ టిస్సీ, సిస్టర్ లిల్లీ, కోచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏసీసీ, జూలై 10 : మంచిర్యాల మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ ఉప్పలయ్యకు వినతి పత్రం అందించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ వయస్సు పై బడిన కార్మికుల స్థానంలో వారసులను విధుల్లోకి తీసుకోవాలని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సల్ల మహేష్, కౌన్సిలర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసు

ఏసీసీ, జూలై 10 : నస్పూర్ మండలం సీతారాంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులకు ఆలస్యంగా హాజరైన ఆరుగురు ఉపాధ్యాయులకు డీఈవో యాదయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం డీఈవో పాఠశాలను తనిఖీ చేయగా ఆరుగురు ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి హాజరు కాలేదు. దీంతో ఆలస్యంగా హాజరైనం దుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు.

వేతనాలు చెల్లించాలి

- ఎంపీవోకు పారిశుధ్య కార్మికుల వినతి

భీమారం, జూలై 10: పంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని, వెంటనే వెంటనే చెల్లించాలని కోరుతూ 11 గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులు ఎంపీవో శ్రీపతి బాపుకు బుధవారం వినతి పత్రం అందించారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బం దులు పడుతున్నామని తెలిపారు. ప్రతి రోజు మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నామని వాపోయారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. వెంటనే ఆరు నెలల వేతనాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అన్నపురం కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



జైపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

చెన్నూరు, జూలై 10: పట్టణంలోని 10వ వార్డులో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్‌లు, మున్సిపల్, వైద్య, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జైపూర్ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా అన్నారు. బుధవారం మంచిర్యాల నర్సింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శోభారాణి, ఫార్మాసిస్టు చంద్ర య్య, ఆరోగ్య కార్యకర్త మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

శ్రీరాంపూర్, జూలై 10: బీటెక్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీజీఎం (పర్సనల్) పి.అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందని, దానిని జూలై 23వ తేదీ వరకు పెంచినట్లు పేర్కొన్నారు. మంథని జేఎన్‌టీయూ(హెచ్)లో మైనింగ్ ఇంజనీరింగ్‌లో 6 సీట్లు(అధికారుల పిల్లలకు 3, కార్మికుల పిల్లలకు 3 చొప్పున), సివిల్ ఇంజనీరింగ్‌లో 6 సీట్లు, మెకానికల్ ఇంనీరింగ్‌లో 6 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 6 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో 6 సీట్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మెషీన్ ఇంజనీరింగ్‌లో 6 సీట్లు మొత్తం 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కాగా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(కెయు) కొత్తగూడెంలో మైనింగ్ ఇంజనీరింగ్‌లో 2 సీట్లు(అధికారుల పిల్లలకు 1, కార్మికుల పిల్లలకు 1 చొప్పున), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో 2 సీట్లు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో 2 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 2 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో 2 సీట్లు మొత్తం 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 10 కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు నామినేషన్‌లు పంపేలా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలోడీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డులు



- కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- బీఆర్ఎస్ హయాంలో కుప్పలు తెప్పలుగా పెండింగ్
- రెండున్నర ఏళ్లుగా కలగని మోక్షం
- జిల్లాలో సుమారు 15వేల దరఖాస్తులు

మంచిర్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగు వన ఉండి, అర్హతగల వారికి త్వరలో కొత్త రేషన్ కార్డులు అందనున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో దరఖా స్తుదారుల్లో ఆనందం వెలువిరుస్తోంది. రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత కార్డులు పొందేందేకు అర్హతలున్న ప్రజలు సంవత్సరాల తరబడి వాటి కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోగా, బీఆర్ఎస్ హయాంలో రెండున్నర సంవత్సరాల క్రితం మళ్లీ ఆ ప్రస్తావన వచ్చింది. 2021 జూ న్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనతో కొత్త కార్డుల ప్రక్రియ తెరపైకి రాగా, అర్హతగల వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరిం చారు. రెండున్నర ఏళ్లు గడిచినా తిరిగి కొత్త కార్డుల ఊసే ఎత్తకపోవ డంతో దరఖాస్తు దారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

• జిల్లా వ్యాప్తంగా..

మంచిర్యాల జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు 2 లక్షల 19 వేల 162 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు జిల్లాలోని 311 గ్రామ పంచాయితీల పరిధిలో మొత్తం 423 చౌక ధరల దుకాణాలు అందుబాటులో ఉన్నాయి. అయా దుకాణాల ద్వారా కార్డులున్న లబ్ధిదారులకు రేషన్ అందుతోంది. జిల్లాలోని మొత్తం రేషన్ కార్డుల్లో అంత్యోదయ కార్డుల లబ్ధిదారులు 15, 417 కార్డులు ఉండగా, ఆహార భద్రత కార్డులు 2 లక్షల 3వేల 575, అన్నపూర్ణ 170 కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం పెండింగులో ఉన్న దరఖాస్తులకు సంబంధించి నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ నుంచి పౌర సరఫరాలశాఖకు అందిన సమాచారం ప్రకారం 8095 కొత్త ఆహార భద్రత కార్డులకు మాత్రమే అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు 1100 పైచిలుకు ఆహార భద్రత కార్డులు పూర్తికాగా, జిల్లా పౌరసరఫరాల అధికారి లాగిన్‌లో సిబ్బంది పొందు పరిచారు. ప్రభు త్వం నుంచి అనుమతి రాని కారణంగా సిద్ధంగా ఉన్నప్పటికీ కార్డులు పంపిణీకి నోచుకోలేదు.

• చిగిరిస్తున్న ఆశలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేస్తున్న ప్రజల ఆశలు మళ్లీ చిగిరిస్తున్నాయి. ఈ మేర కు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సివిల్ సప్లై అధికారులతో నిర్వహించిన సమీక్షలో కొత్త రేషన్ కార్డు దరఖా స్తులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తొలి రోజుల్లోనే రేషన్ కార్డుల ప్రస్తావన తేవడంతో దరఖా స్తుదారులు ఆనందంతో ఉన్నారు.

• 15వేల మంది దరఖాస్తు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత కొత్త రేషన్ కార్డుల జారీకి మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించింది. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన 6 గ్యారెంటీల్లో భాగంగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు సన్నద్ధం అవుతోంది. ఈ క్రమంలో డిసెంబరు మాసంలో దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం 18 వేల 426 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం స్వీకరించిన వాటిలో వివిధ కారణాల చేత అర్హతలేని 3200 మందికి చెందిన దరఖాస్తులను అధికారులు రద్దు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 15వేల 226 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేయవలసి ఉంది. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తే జిల్లాలోని సుమారు 30వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

• 423 చౌకధరల దుకాణాల పరిధిలో..

కొత్త రేషన్ కార్డుల జారీ విషయమై తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో చౌక ధరల దుకాణాల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 423 చౌకధరల దుకాణాల పరిధిలో ఒక్కో షాపుకు కనీసం 700 కార్డులను కేటాయించారు. ప్రతి నెలా షాపుల వద్ద రేషన్ కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. ప్రభుత్వం కొత్త కార్డులు జారీ చేసిన పక్షంలో ఆయా షాపులకు కేటాయిం చిన కార్డుల సంఖ్య మరింత పెరిగి, ప్రజల ఇబ్బందులు మ రింతగా పెరిగే అవకాశం ఉంది. లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా కొత్త షాపులు ఏర్పాటు చేస్తే ప్రజలకు, డీలర్లకు భారం తగ్గినట్లవుతుంది. గత ప్రభుత్వం కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసినప్పటికీ ఆ ప్రక్రియ కొలిక్కి రాలేదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాను కూ ల నిర్ణయం తీసుకుంటే.. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 423 షాపులకు అద నంగా మరో 30 చౌక ధరల దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు బోడంకి చందు



చెన్నూరులో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

చెన్నూరు, జూలై 10: అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం కార్మికుల కు నెలకు కనీసవ వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బోడంకి చందు డిమాండ్ చేశారు. చెన్నూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు అవలంబిస్తోందన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శారద, సుమతి, ప్రవీణ, విజయ, సరోజ, రాజేశ్వరి, మంగ, కరీమా, గట్టక్క, సమ్మక్క, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గౌరవ వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ఈపీఎఫ్ , హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలతో వేతనాలు సరిపోక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, జ్యోతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు వినతిపత్రం అందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన కోర్కెల దినాన్ని పురస్కరించుకుని ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ఎం స్కీంకు బడ్జెట్ పెంచాలని,ప్రైవేటీకరణ చేయవద్దని, కనీస వేతనం రూ. 26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలన్నారు. గతంలో నిర్వహించిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

బెల్లంపల్లి(తాండూర్): సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తాండూర్ ఐబీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. వివిధ స్కీంలలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంటు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పావని, ప్రమీల, సత్యవతి, సీతాబాయి, సుజాత,కరుణ, జయశ్రీ, విజయలక్ష్మి, శారద, రాజేశ్వరి, సావిత్రి, లక్ష్మీ, రాజేశం,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మందమర్రిటౌన్, జూలై 10: విద్యార్థులు పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం మహిళ కానిస్టేబుల్ జ్యోతి, కానిస్టేబుల్ శ్రావణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, వరకట్న చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి , ఉపాధ్యాయులు సుష్మ, సబిత తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : ఆదర్శ పాఠశాలలోని విద్యార్థినులకు షీటీంపై బుధవారం షీటీం కానిస్టే బుల్ జ్యోతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్లు శ్రావణ్‌కుమార్, సతీష్, భరోసా సెంటర్ సిబ్బంది విజయ, ప్రియాంక, ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

దండేపల్లి,జూలై 10: సమాజ సేవలో అమ్మ ఫౌండేషన్ మరింత భాగస్వాములై మంచి సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మపర్సన్ మర్రి ప్రవీణరెడ్డి, దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బీసగోని శంకర్‌గౌడ్‌లు సూచించారు. దండేపల్లిలో అమ్మ ఫౌండేషన్ స్థాపించి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు స్టడీ మెటీరియల్ బుధవారం వారి చేతుల మీదిగా పంపిణీ చేశారు. చిన్నారులకు పలుక బలుపాలు, 1 నుంచి ఐదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులందరికీ నోట్‌బుక్స్, కంపాక్స్ బాక్స్, పెన్సిల్, పెన్నులు ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపా ధ్యాయులు సౌజన్య, సునిత, అమ్మ ఫౌండేషన్ నిర్వహకులు భానుప్రసాద్, సత్యం, రాజేశ్వర్‌రావు, కుమా రస్వామి, సురేష్, వెంకటేశ్వర్లు, మహేష్, వెంకటేష్, నవీన, అనంతలక్ష్మి, కల్యాణి, లావణ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 10: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం హైద్రాబాద్ నుంచి మంత్రి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. మంచిర్యాల - వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జీ 334 కిలోమీటర్లమేర ఉంటుందని, ఇందుకు గాను 1383 హెక్టార్ల బూమి సేకరించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో ఇప్పటి వరకు 1,284 హెక్టార్ల భూమికి అవార్డు జారీ చేశామని వివరించారు. 415 హెక్టార్ల భూమి జాతీయ రహదారుల సంస్థకు అప్పగిచామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 99 హెక్టార్ల భూసేకరణ నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల జాతీయ రహదారి 63 నిర్మాణం 132 కిలోమీటర్లమేర ఉంటుం వివరించారు. దీని కోసం 536.9 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉండగా 542 హెక్టార్ల భూమి సేకరించడం పూర్తి చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో భూసేకరణ అవార్డు జారీ చేసి భూ బదలాయింపు జరుగని సంబంధిత రైతులు, భూ యాజమాన్యాలతో చర్చించి అర్బిట్రేషన్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారులు 163జీ , 63 నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకు 75 శాతం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థకు అప్పగించామని చెప్పారు. మిగిలిన 25 శాతం భూసేకరణను 10, 14 రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగించాలి

కోటపల్లి, జూలై 10: గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని ఎంపీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని వెంచపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంరతం పంచాయతీ కార్యదర్శి స్వర్ణకు , సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలోని చెత్తను సేకరించాలని, రోడ్లు కాలువలను శుభ్రం చేయాలని చెప్పారు. వారానికి ఒకసారి ఫాగింగ్ చేయాలని, డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

రైతులను మోసగించిన ప్రభుత్వం



తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేపడుతున్న నాయకులు

దండేపల్లి, జూలై 10: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బీజేపీతో పాటు కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో బుధవారం దండేపల్లి బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తునా ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎటువంటి అంక్షలు లేకుండా రూ. 2లక్షల పంట రుణమాఫీ చేయాలన్నారు. సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రైతు భోరోసా కింద వానాకాలం, యాసంగి కలుపుకోని 15వేల రుపాయలను అందించాలన్నారు. కౌలురైతులకు ఏడాదికి రూ 15వేలు చెల్లించాలన్నారు. వ్యవసాయ కూలీలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏడాదికి 12వేల రూపాయలు వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులకు పదవులు, ఎమ్మెల్యేల కొనుగోలు చేయడంలో ఉన్న శ్రద్ధ రైతులపై లేదని మండిపడ్డారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీలన్నింటి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్‌తో కూడిన వినత్రినతాన్ని తహసీల్దార్ సంధ్యారాణికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షకార్యదర్శులు రాజన్న, రవిగౌడ్, సురేందర్, శ్రీనివాస్, గూడెం పీఏసీఎస్ చైర్మన్ సురేష్, నాయకులు గరువయ్య, ప్రభాకర్, రాకేష్, దివ్య, కిషన్, సత్తయ్య, వెంకటేష్, తులసి, నరేష్, విజేందర్, అశోక్, అనిల్, మల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.